1,087 బోగస్ సదరం సర్టిఫికెట్లు రద్దు

● వీరికి ఆగనున్న పింఛన్లు


ఆంధ్రజ్యోతి కడప
పింఛన్ల కోసం..
మాయరోగం
కుప్పలు తెప్పలుగా బోగస్ పింఛన్లు

ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం కటింగ్

కడప (ఎన్జీఆర్ సర్కిల్), ఆగస్టు 30: జిల్లాలో 1,087 బోగస్ సదరం సర్టిఫికెట్లను వైద్యాధికారులు గుర్తించారు. జిల్లాలో మొత్తం 3,436 మందికి తమ వైకల్య ధ్రువీకరణ కోసం అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇందులో 1,196 మంది మాత్రమే వైద్య పరీక్షలకు హాజరయ్యారు. మిగిలిన వారు గైర్హాజరు కావడంతో తిరిగి వారికి వైద్యపరీక్షల తేదీని ఖరారు చేస్తూ నోటీసులు జారీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది జూన్ 16న 'పింఛన్ల కోసం మాయరోగం..' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. ఈ క్రమంలో అధికారులు సదరం సర్టిఫికెట్లపై నిఘా ఉంచారు. వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బడి ముబ్బడిగా వైకల్య పింఛన్లు మంజూరయ్యాయి. 2019నాటికి ఉన్న వైకల్య పింఛన్ల కంటే అత్యధికంగా పెరిగాయి. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన వ్యక్తులు ఇతర జిల్లాల్లో ఉన్న ఆస్పత్రుల ద్వారా వైకల్య సర్టిఫికెట్లు పొందారు. వీటి ఆధారంగా వికలాంగులకు ఇచ్చే పింఛన్లు పొందుతున్నారు. వీటిపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో ఇతర జిల్లాల్లో ఇచ్చిన వికలత్వ సర్టిఫికెట్లను మొదట పరిశీలించారు. ఈ క్రమంలో గతంలో జరిగిన వైద్యపరీక్షల్లో ఒక్క పులివెందుల నియోజకవర్గంలోనే 232 బోగస్ వైకల్య సర్టిఫికెట్లుగా నిర్ధారించారు. ప్రస్తుతం చేపట్టిన సర్టిఫికెట్ల నిర్ధారణలో 1087 మందికి సంబంధించిన నకిలీ సర్టిఫికెట్లు తేలాయి. ఇందులో అత్యధికంగా పోరుమామిళ్ల మండలంలో 69, కలసపాడులో 68, ఎర్రగుంట్లలో 60, ముద్దనూరులో 57, కమలాపురంలో 51, మైదుకూరులో 50, తొండూరులో 42, పులివెందులలో 22, వివిధ మండలాల్లో పదికి పైగానే సదరం సర్టిఫికెట్లను బోగస్‌విగా గుర్తించి వీటిని రద్దు చేశారు. సదరం సర్టిఫికెట్లు బోగస్ అని తేలడంతో వారికి అందుతున్న వైకల్య పింఛన్లు రద్దు చేయాలంటూ కలెక్టరు శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సజావుగా ఇసుక పంపిణీ : కలెక్టర్

కడప(కలెక్టరేట్), ఆగస్టు30: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇసుక పంపిణీ ప్రక్రియ జిల్లాలో నిర్దేశించిన బుకింగ్ కేంద్రాల్లో సజావుగా సాగుతోందని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం అన్ని జిల్లాల్లో స్టాక్ యార్డుల వద్ద ఇసుక పంపిణీ, వినియోగదారుల సంతృప్తి, ట్రాన్స్‌పోర్టేషన్‌పై రాష్ట్ర మైన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సమావేశానికి జేసీ అదితిసింగ్‌తో కలసి కలెక్టర్ హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. ఇసుక పంపిణీలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కంట్రోల్ రూమ్ నెంబరు 08562-246344కు వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం ఇసుక బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు కాల్ చేసి రవాణాకు ఎంత డబ్బు వసూలు చేస్తున్నారు? బుకింగ్ చేసుకున్న తరువాత లోడింగ్‌కు ఎంత సమయం పట్టిందనే విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్ గౌడ్, ఆర్డీఓలు వెంకటపతి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, గనుల శాఖ ఆర్ఐ విమలమ్మ, డీటీసీ మీరా ప్రసాద్, స్టాక్ పాయింట్స్ ప్రత్యేకాధికారి సురేశ్‌కుమార్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఒక్కరోజు ముందే పింఛన్ల పంపిణీ

కడప(కలెక్టరేట్) ఆగస్టు 30: జిల్లాలో ఒక్క రోజు ముందుగానే పింఛన్ల పంపిణీ చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శివశంకర్ ఆదేశించారు. శుక్రవారం జేసీ అదితి సింగ్‌తో కలసి కలెక్టర్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై జిల్లా అధికారులతో సమీక్షిస్తూ శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచి పెన్షన్లు అందజేయాలన్నారు. సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందే పెన్షన్లు పంపిణీ చేస్తామన్నారు.

జడ్పీలో బదిలీలకు పెద్దఎత్తున పైరవీలు సాగుతున్నాయి. నిబంధనలకు నీళ్లొదిలి సిఫారసులకే ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వ పాలనలో కూడా జిల్లా పరిషత్‌శాఖ బదిలీలపై వైసీపీ పట్టు బిగిస్తోందని ప్రచారం సాగుతోంది. తమ అనుకూల ఉద్యోగులను అనుకున్నచోటికి బదిలీ చేయయించడానికి పావులు కదుపుతోందని అంటున్నారు. ఈ మేరకు జడ్పీ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ జె.శారద, జడ్పీ చైర్మన్ అభ్యర్థి, బి.మఠం జడ్పీటీసీ రామగోవింద్‌రెడ్డి, వైస్ చైర్మన్ బాలయ్య, ఆ పార్టీకి చెందిన పలువురు జడ్పీటీసీలు గురువారం జడ్పీ చైర్మన్ చాంబర్‌లో భేటీ అయ్యి బదిలీలపై చర్చించినట్లు సమాచారం.



బదిలీలకు పైరవీలు

● కుప్పలు తెప్పలుగా సిఫారసు లెటర్లు
● తలలు పట్టుకుంటున్న అధికారులు ● బదిలీల్లో పట్టుబిగిస్తున్న వైసీపీ?

కడప రూరల్, ఆగస్టు 30: 2019 నుంచి గత ఏడాది 2023 వరకు జడ్పీ బదిలీలు వైసీపీ పెద్దల కనుసన్నల్లో జరిగాయి. ప్రస్తుత టీడీపీ కూటమి పాలనలో జరుగుతున్న జడ్పీ బదిలీలను కూడా తమకు అనుకూలంగా సాగించాలని వైసీపీ నేతలు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇటీవల ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఒకే చోట 5 సంవత్సరాల సర్వీసును పూర్తి చేసిన వారికి తప్పనిసరిగా బదిలీ చేయాలని పేర్కొంది. ఈ మేరకు జిల్లా పరిషత్‌శాఖ పరిధిలో మొత్తం 1,114 మంది అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తుండగా వీరిలో 5 ఏళ్ల సర్వీస్ పూర్తిచేసిన వారు 438 ఉన్నారు. వీరితో పాటు రిక్వెస్ట్ బదిలీలకు కూడా దరఖాస్తు చేసుకోవాలని జడ్పీశాఖ సూచించింది. మొత్తం 437 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఎంపీడీవోలు 17 మంది, ఏవోలు 34 మంది, సీనియర్ అసిస్టెంట్లు 40 మంది, జూనియర్ అసిస్టెంట్లు 108 మంది, టైపిస్టులు 31 మంది, రికార్డు అసిస్టెంట్లు 102 మంది, అటెండర్లు 105 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే 5 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసిన వారిలో కొందరు యథాస్థానంలో కొనసాగేందుకు పావులు కదుపుతున్నారు. కొందరైతే రకరకాల సాకులు చూపుతూ 10 ఏళ్లకు పైబడి ఒక చోట ఉన్నారు. ఇప్పుడు కూడా అక్కడే ఉండేందుకు పరిస్థితులను చక్కదిద్దుకుంటున్నారు. తమతో అంటకాగిన వారిని బదిలీల్లో దూరం వెళ్లనీయకుండా కాపాడాల్సిన బాధ్యతను వైసీపీ పెద్దలు జడ్పీ పాలకమండలిపై ఉంచినట్లు సమాచారం.

ఒకేచోటికి.. ముగ్గురికి సిఫారసు

బదిలీలకు దరఖాస్తు చేసుకున్న ఆయా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అనుకున్న చోటికి బదిలీ కావడానికి జోరుగా పైరవీలు సాగిస్తున్నారు. ఇప్పటికే కొందరు టీడీపీ, వైసీపీ, బీజేపీ, జనసేన నాయకుల చుట్టూ చక్కర్లు కొట్టి ఆయా ఎమ్మెల్యేల లెటర్లను సంపాదించుకొని జడ్పీకి అందజేశారు. ఒకే చోటికి ముగ్గురు దరఖాస్తు చేసుకుంటే ఆ ముగ్గురూ ఆయా ఎమ్మెల్యేల నుంచి సిఫారసు లెటర్లు ఇవ్వడం విశేషం.

అడకత్తెరలో పోక చెక్కలా అధికారులు

రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉంది. ఉమ్మడి కడప జిల్లాలోని జడ్పీ పాలకమండలి వైసీపీ చేతిలో ఉంది. అలాగే పులివెందుల, బద్వేలు, రాజంపేట ఎమ్మెల్యేలతో పాటు కడప, రాజంపేట ఎంపీలు వైసీపీకి చెందినవారు ఉన్నారు. కడప, కమలాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరు, రాయచోటి, జమ్మలమడుగు, రైల్వేకోడూరు ఎమ్మెల్యేలు టీడీపీ కూటమికి చెందిన వారు ఉన్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న జడ్పీ బదిలీల్లో ఇటు వైసీపీ, అటు టీడీపీ నాయకుల నుంచి తీవ్రమైన వత్తిళ్లు వస్తుండడంతో అధికారుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల నుంచి సిఫారసు లెటర్లు కుప్పలు తెప్పలుగా రావడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.



మళ్లీ వారిదే హవా!

● బదిలీల్లో చక్రం తిప్పిన సెర్ప్ సిబ్బంది
● వైసీపీతో అంటకాగిన వారికి కోరిన చోట పోస్టింగ్ ● ఇబ్బడి ముబ్బడిగా ఎమ్మెల్యేల లేఖలు

కడప (ఎన్జీఆర్ సర్కిల్), ఆగస్టు 30: వైసీపీతో ఐదేళ్లుగా అంటకాగిన కొంతమంది సెర్ప్ సిబ్బంది ఇప్పుడు కూడా హవా కొనసాగిస్తున్నారు. ఈ ప్రభుత్వంలో అయినా తాము కోరుకున్న చోటికి బదిలీ పొందవచ్చని ఆశించిన సెర్ప్ సిబ్బందికి నిరాశే మిగులుతోంది. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ ప్రయోజనాల కోసం శక్తి వంచన లేకుండా పనిచేసిన కొంతమంది సెర్ప్ సిబ్బంది.. ప్రభుత్వం మారిన వెంటనే ఇబ్బందులు పడతారని అందరూ అనుకున్నారు. అయితే బంధుత్వాలు, సామాజిక వర్గానికి ప్రస్తుత పాలకులు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. మాజీ ముఖ్యమంత్రి ప్రాంతానికి చెందిన ఒకాయన గత ప్రభుత్వంలో వైసీపీ కోసం ఎంతో శ్రమించారని ఆయనకు కూడా ప్రస్తుతం ప్రయోజనం చేకూరేలా బదిలీ జరుగుతోందని అంటున్నారు. ఎల్-2 క్యాడర్‌కు చెందిన ఒక ఉద్యోగి 15 సంవత్సరాల నుంచి డీఆర్డీఏ హెడ్ ఆఫీసులో పనిచేస్తున్నారు. ఎవరికి ఎలా కావాలంటే ఆ విధంగా ఆయన లబ్ధి చేకూర్చుతారనే పేరుంది. గత ప్రభుత్వంలో వైసీపీతో అంటకాగడంతో అప్పుడు కూడా ఈయన పెత్తనం సాగేదని ఈ ప్రభుత్వం వచ్చినా తనకు అడ్డు లేదనే విధంగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. హెడ్ ఆఫీసులో పనిచేస్తున్న మరో ఉద్యోగి పరోక్షంగా వీఓఏల చేత వైసీపీకి ఎన్నికల్లో ప్రచారం చేయించారనే చర్చ కూడా ఉంది. ప్రస్తుత బదిలీల్లో ఆయనకు పెద్ద పీట వేసినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో ఈయన ఏకంగా వైసీపీ కార్యాలయాన్ని వేదిక చేసుకుని మహిళా సంఘాల ప్రతినిధులతో స్థానిక ఎమ్మెల్యేతో కలిసి సమావేశం నిర్వహించారు. అలాంటి వ్యక్తికి ఈ ప్రభుత్వంలో కూడా ప్రాధాన్యత కల్పించడంపై సెర్ప్ సిబ్బంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సెర్ప్ సిబ్బంది బదిలీలకు ఎమ్మెల్యేలు ఇబ్బడి ముబ్బడిగా లేఖలు ఇచ్చినట్లు తెలుస్తోంది. డీఆర్డీఏలోని అధికారి ఒకరు తన కోటరీని వదులుకునేందుకు ఏ మాత్రం ఇష్టపడ్డం లేదని.. ఆయన సలహాతో అధికార పార్టీ ఎమ్మెల్యేల నుంచి ఒక్కో ఉద్యోగి రెండు, మూడు లేఖలు తెచ్చుకున్నట్లు సమాచారం. రాష్ట్రమంత్రి కూడా ఒకరికి సిఫారసు లేఖ ఇచ్చినట్లు తెలుస్తోంది. గతంలో వైసీపీ ఎమ్మెల్యేల నుంచి లెటరు తెచ్చుకున్న వారే ఇప్పుడు టీడీపీ ఎమ్మెల్యేల నుంచి కూడా లెటరు తెచ్చుకున్నారని అంటున్నారు. దీంతో రాజకీయ పలుకుబడి లేని తమకు అన్యాయం జరుగుతోందని పలువురు సెర్ప్ సిబ్బంది వాపోతున్నారు. పైరవీలను పక్కనబెట్టి పనితీరు, నిబంధనల మేరకు బదిలీలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వీరు కోరుతున్నారు.

సెర్ప్ సీఈవోకు ఫిర్యాదు ?

నిబంధనలు పక్కనబెట్టి బదిలీల్లో ఇష్టానుసారంగా వ్యవహరించ వద్దంటూ డీఆర్డీఏ పీడీపై జిల్లాలోని సీనియర్ టీడీపీ నేత ఒకరు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు చర్చ సాగుతోంది. గత ఐదేళ్ల వైసీపీ నాయకులు చెప్పినట్లు పనిచేసి వారి ప్రయోజనాల కోసం పాకులాడిన వారిని కొనసాగించాలనే అధికారుల తీరును ఆయన తప్పు పట్టినట్లు తెలుస్తోంది. ఈ మేరకు డీఆర్డీఏ అధికారిపై సెర్ప్ సీఈవోకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



కష్టపడి చదివితే ఉన్నత అవకాశాలు

● ట్రిపుల్‌ఐటీలో చదివిన విద్యార్థి.. చిత్తూరు జేసీ విద్యాధరి

వేంపల్లె, ఆగస్టు 30: కష్టపడి చదవండి ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొందండి అని చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి విద్యార్థులకు సూచించారు. 2008లో ట్రిపుల్‌ఐటీలో చేరి ఈసీఈ ఇంజనీరింగ్ 2014 పూర్తిచేసిన విద్యాధరి 2021లో సివిల్స్‌లో 221 ర్యాంక్ సాధించి ఐఏఎస్ సాధించారు. ఇటీవల చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో విద్యాధరి శుక్రవారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీని సందర్శించారు. డైరెక్టర్ గుప్త, ఏఓ రవికుమార్, డీన్ రత్నకుమారి, ఇతర అధ్యాపకులు జేసీని సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను చదివిన పరిస్థితిని, ఐఏఎస్ సాధించే ప్రయత్నాలను విద్యార్థులకు తెలియజేశారు. లక్ష్య సాధనకై కష్టపడితే విజయం తప్పకుండా వరిస్తుందని విద్యార్థులకు ఉద్బోధించారు.

ట్రిపుల్‌ఐటీలో చదివి, ప్రస్తుతం చిత్తూరు జేసీగా పనిచేస్తున్న గొబ్బిళ్ల విద్యాధరిని సత్కరిస్తున్న డైరెక్టర్ గుప్త, ఇతర అధికారులు

జిల్లా ప్రత్యేక అధికారిగా చక్రధర్ బాబు



కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 30: జిల్లా ప్రత్యేక అధికారిగా ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ చక్రధర్‌బాబును నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్‌ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించనున్నారు.

జిల్లా అదనపు ఎస్పీగా ప్రకాశ్‌బాబు

కడప (క్రైం), ఆగస్టు 30: జిల్లా పోలీసు పరిపాలనా విభాగానికి అదనపు ఎస్పీగా ప్రకాశ్‌బాబును నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా డీఎస్పీలకు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన)గా ప్రకాశ్‌బాబును నియమించారు. ప్రస్తుతం ఆయన ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీగా పనిచేస్తున్నారు. ఆయనకు పదోన్నతి కల్పిస్తూ కడప జిల్లాకు నియమించారు.

డ్యామిట్.. కథ అడ్డం తిరిగింది..!

● బార్ల ఫీజులో రాయితీ ఇస్తామని నేతల హామీ
● రెండు నెలలుగా లైసెన్స్ ఫీజులు చెల్లించకుండా కాలయాపన
● 20వ తేదీతో ముగిసిన గడువు
● 18 శాతం వడ్డీతో.. రేపు ఆఖరు
● రూ.30లక్షలకు పైగా అదనపు భారం

అనుకున్నది ఒకటి అయింది ఒక్కటీ.. బోల్తా పడిందిలే బుల్ బుల్ పిట్టా అని నాలుగు దశాబ్దాల క్రితం బ్లాక్ అండ్ వైట్ సినిమాలో పాట ఉంది. అది బాగా ప్రేక్షకాదరణ పొందింది. ఇప్పుడు అచ్చం అలాగే తయారైంది కడప బార్ యజమానుల పరిస్థితి. రెండేళ్ల క్రితం నిర్వహించిన వేలంలో పోటీ పడి మరీ బార్లను దక్కించుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా కడపలోనే అత్యధిక ధరలు పలికాయి. రెండేళ్లపాటు లైసెన్సు ఫీజులు చెల్లించారు. లాభాలు బాగానే గడించారు. అయితే కూటమి ప్రభుత్వం రావడం, నూతన ఎక్సైజ్ పాలసీ విధానం తీసుకువస్తామని ప్రకటించడంతో.. బార్ల యజమానులు లైసెన్సు ఫీజు చెల్లించడంలో పునరాలోచనలో పడ్డారు. ఇంతలో కూటమి నేతలు జిల్లాలోని కొన్ని బార్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వంతో మాట్లాడి లైసెన్సు ఫీజులో రాయితీ ఇప్పిస్తామని బార్ల యజమానులకు హామీ ఇచ్చారు. వారి మాటలు నమ్మి లైసెన్సు ఫీజు రెన్యువల్‌కు గడువు ముంచుకొస్తున్నా చెల్లించకుండా లైట్ తీసుకున్నారు. అయితే ఆలస్యం చేస్తే బార్లు రద్దు చేస్తామని ఎక్సైజ్ శాఖ హెచ్చరించడం.. రాయితీ ఇప్పించడంలో కూటమి నేతలు చేతులెత్తేయడంతో.. డామిట్ కథ అడ్డం తిరిగిదంటూ.. 18 శాతం వడ్డీ చెల్లించి మరీ బార్లకు రెన్యువల్ చేయించుకోవాల్సి రావడం ఇప్పుడు మద్యం వ్యాపారుల్లో హాట్‌టాపిక్‌గా మారింది.



స్టేట్‌లోనే అత్యధికంగా వేలంలో రూ.1.83 కోట్లు పలికిన ఎర్రముక్కపల్లె వద్ద గల బార్

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ సర్కారు 2019లో నూతన మద్యం పాలసీ తీసుకువచ్చింది. ప్రైవేటు షాపులకు మంగళం పలికి ప్రభుత్వమే మద్యం అమ్మకాలు మొదలుపెట్టింది. రెండేళ్ల క్రితం బార్లకు వేలం వేసింది. కడపలో 12, ప్రొద్దుటూరులో 8, బద్వేలులో 2, పులివెందుల, జమ్మలమడుగు, కమలాపురం, వేంపల్లె, పోరుమామిళ్ల, మైదుకూరులో ఒక్కో బార్‌కు వేలం నిర్వహించారు. ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన ధరలు నిర్ణయించింది. కడప, ప్రొద్దుటూరులో ఒక్కో బార్ ధరను రూ.35లక్షలుగా నిర్ణయించింది. కడపలో మద్యం వ్యాపారుల మధ్య పోటీ లేకుండా సిండికేట్ చేసేందుకు అప్పట్లో వైసీపీ నేతలు తీవ్రంగా ప్రయత్నం చేసినా కుదరలేదు. పోటాపోటీగా వేలంలో పాల్గొన్నారు. దీంతో రాష్ట్రంలోనే అత్యధిక వేలం పలికిన మొదటి నాలుగు బార్లు కడపలోనే ఉన్నాయి. ఎర్రముక్కపల్లెలోని శ్రీకర్ బార్‌ను రూ.1.83 కోట్లతో దక్కించుకున్నారు. ఇదే రాష్ట్రంలో అత్యధిక ధర. రెండోది అప్సర వద్ద గల సుధా బార్ రూ.1.81 కోట్లు పలికింది. మూడోది చెన్నూరు బస్టాండులోని శివ బార్ అండ్ రెస్టారెంట్ 1.80కోట్లు, రాజంపేట రోడ్డులోని పునీత్ బార్ 1.79 కోట్లు పలికాయి. మిగతా బార్‌లు కూడా ప్రభుత్వ ధర కన్నా ఎక్కువకు పాడుకున్నారు.

అయితే ప్రభుత్వ మద్యం షాపుల్లో మందుబాబులు అప్పటి వరకు తాగిన బ్రాండ్లు లేకుండా జే బ్రాండ్‌లు వచ్చేశాయి. కంపెనీ మద్యం బదులు రూ.150, రూ.200 మందు ఇవ్వండనే పరిస్థితి వచ్చింది. బార్లలో అన్నిరకాల బ్రాండ్లు దొరికేవి. దీంతో మందుబాబులు బార్లకు వెళ్లి కొనుగోలు చేసేవారు. అక్కడ బ్రాండ్లను బట్టి క్వార్టరుపై రూ.50 నుంచి రూ.100 ఎక్కువగా విక్రయించేవారు. దీంతో వ్యాపారం లాభసాటిగా ఉండేది. ఇక నగరంలో ఉన్న బార్ల బ్యాచ్ తమకున్న పలుకుబడితో ప్రభుత్వ మద్యంషాపులన్నీ నగర శివారుల్లోకి, సుదూర ప్రాంతాల్లోకి తరలించేశారు. దీంతో మందుబాబులు దూరం వెళ్లలేక బార్లలోనే మద్యం కొనుగోలు చేసేవారు. దీంతో బార్ల బిజినెస్ కళకళలాడేది.

నూతన మద్యం పాలసీతో

జగన్ మద్యం పాలసీపై తీవ్ర విమర్శలు వచ్చాయి. పిచ్చి పిచ్చి బ్రాండ్లు, అధిక ధరలు ఆరోపణలకు తావిచ్చింది. ఈ నేపథ్యంలో నాణ్యమైన మందు ఇస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నూతన మద్యం పాలసీ తీసుకురావాలని నిర్ణయించారు. సెప్టెంబరు 30తో ఇప్పుడున్న మద్యంపాలసీ ముగియనుంది. ఈ నేపథ్యంలో అధికారం చేపట్టగానే కూటమి నేతలు కడపలో 2, జమ్మలమడుగులో ఒక బార్‌ను స్వాధీనం చేసుకున్నారు. బార్లు లాక్కున్న వ్యవహారం జిల్లాలో పెద్ద సంచలనమే రేకెత్తించింది. అయితే ప్రభుత్వంలోని కీలక నేతలతో మాట్లాడి మద్యం ఫీజులో రాయితీ ఇప్పిస్తామంటూ కొందరు కూటమి నేతలు బార్ల యజమానులకు హామీ ఇస్తూ వచ్చారు. ఎందుకంటే బార్లు లాక్కున్న వారు కూడా ఫీజులు చెల్లించాల్సి రావడంతో.. ఎలాగైనా సరే లైసెన్సు ఫీజు తగ్గిస్తామని హామీ ఇచ్చారు. లైసెన్సు గడువు శనివారంతో ముగుస్తుంది. సెప్టెంబరు 1 నుంచి బార్లు కొనసాగాలంటే లైసెన్సు ఫీజు చెల్లించాలి. వాస్తవానికి ఈ నెల 20లోపే డబ్బులు చెల్లించాల్సి ఉంది. అయితే కూటమి నేతల మాటలు విని కొంతమంది బార్ల యజమానులు లైసెన్సు ఫీజు చెల్లించలేదు. ఎలాగైనా వీరు మాట్లాడుతారులే అనే ఉద్దేశ్యంతో కట్టలేదు. ప్రొద్దుటూరు ఇతర ప్రాంతాల్లోని బార్ల యజమానులు మాత్రం డబ్బులు చెల్లించారు. కడపలో కూటమి నేతలు బార్లు లాక్కోవడంతో వాటి కోసం అయినా లైసెన్స్ ఫీజుపై రాయితీ ఇస్తారని బార్ల యాజమాన్యం ఆశించింది. గడువు దాటినా ఫీజు చెల్లించకపోవడంతో ఎక్సైజ్ అధికారులు హెచ్చరిస్తూ నాలుగురోజుల పాటు స్టాకు నిలిపివేశారు. చివరికి కూటమి నేతలతో ఎక్సైజ్ అధికారులకు ఫోను చేయించుకుని ఎలాగోలా స్టాకు ఎత్తించుకున్నారు. అయితే ఇప్పుడు ఫీజుల్లో రాయితీ అలా వదిలేసి హామీ ఇచ్చినవారు చేతులెత్తే పరిస్థితి వచ్చింది. దీంతో 18 శాతం వడ్డీతో బార్ల యజమానులు నేడు లైసెన్సు ఫీజు చెల్లించేందుకు సిద్ధమయ్యారు. 31వ తేదీ లోగా లైసెన్స్ ఫీజు చెల్లించకుంటే సెప్టెంబరు 1వతేదీన షాపులు సీజ్ చేస్తామని ఎక్సైజ్ శాఖ హెచ్చరించడంతో చెల్లింపులకు రెడీ అయ్యారు. లైసెన్సు ఫీజుపై ఏటా 10 శాతం అదనంగా చెల్లించాలి. అంటే ఇప్పుడు రూ.1.80 కోట్లు ఉన్న వారు రూ.1.98 కోట్లు చెల్లించాలి. 20వ తేదీ లోపు ఈ ఫీజు చెల్లించలేదు కాబట్టి దీనికి 18 శాతం వడ్డీతో ఇప్పుడు చెల్లించాలి. అంటే అదనంగా మరో రూ.35 లక్షలు చెల్లించాల్సి వచ్చింది. ప్రైవేటు మద్యం పాలసీ వస్తుందంటూ వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో లైసెన్సు ఫీజుల్లో రాయితీ ఇస్తే ఈసారి కూడా గట్టెక్కుతామని వీరంతా ఆశించారు. మొదటికే మోసం వచ్చేలా చివరకు 18 శాతం వడ్డీతో డబ్బులు చెల్లించాల్సి రావడంతో బార్ల యజమానులు లబోదిబోమంటున్నారు. కూటమి నేతలు తమను నిలువునా ముంచేశారని వాపోతున్నారు.

పర్యావరణం పరిరక్షిస్తామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు, జేసీ తదితరులు



ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

● పర్యావరణ పరిక్షణతో మానవాళి మనుగడ : కలెక్టర్ శివశంకర్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 30: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి బాధ్యతగా సంరక్షించాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. శుక్రవారం వైవీయూ ఆవరణలో అటవీశాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పూర్వం వన సంపద ఎంతో ఉండేదని, ప్రస్తుతం వన సంరక్షణ లేకుండా పోతుందన్నారు. సమస్త మానవాళి మనుగడకు పర్యావరణం ప్రధానమైనదన్నారు. పర్యావరణం బాగుండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. వన సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఈ సంవత్సరం 8లక్షల మొక్కలను నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామని పాఠశాలల్లో విద్యార్థులు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. జేసీ అదితిసింగ్ మాట్లాడుతూ రాష్ట్రం అంతా ఈ రోజు అమ్మ పేరుపై మొక్కలు నాటుతున్నారని, ఇది సంతోషించదగ్గ విషయమన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ మొక్కలు నాటేది కాదని బాధ్యతగా వాటిని కాపాడాలన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ తల్లి పేరున మొక్కలునాటడం ఎంతో సంతోసంగా ఉందన్నారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ వన మహోత్సవం గొప్ప కార్యక్రమమని, ప్రతి ఒక్కరూ పర్యావరణంపై అవగాహన కలిగి మొక్కలు నాటాలని అన్నారు. డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో వన మహోత్సవం-2024 విజయవంతం చేస్తామన్నారు. వైవీయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాపాడాలని కోరారు. పచ్చదనం పెంచి పర్యావరణం కాపాడతామంటూ అందరూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కలెక్టరు, జేసీ, డీఎఫ్‌వోలు, ఎమ్మెల్యేలు యూనివర్శిటీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు భూపేశ్‌రెడ్డి, సుంకర శ్రీనివాస్, లక్ష్మిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వైవో నందన్, వైవీయూ రిజిస్ట్రార్ రఘునాథరెడ్డి, డీఎఫ్‌వో నాగార్జునరెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వన మహోత్సవంలో భాగంగా మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

ఇసుక కొరత..అభివృద్ధి పనులకు బ్రేక్

- రెండు నెలలుగా ఆగిపోయిన మార్కెట్ నిర్మాణ పనులు
- పట్టించుకోని మున్సిపల్, రెవెన్యూ అధికారులు

ప్రొద్దుటూరు, ఆగస్టు 30: రాష్ట్రంలో అభివృద్ధి పనులు ముందుకు సాగాలంటే ముఖ్యంగా ఇసుక వనరు చాలా ముఖ్యం. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పోయి టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టింది. కొత్త ప్రభుత్వం నూతన ఉచిత ఇసుక పాలసీ తెచ్చినప్పటికీ.. ప్రొద్దుటూరులో ఇసుక రీచ్ ఏర్పాటు కాలేదు. దీంతో ఈ ప్రాంతంలో ఇసుక అందుబాటులో లేదు. కేవలం అక్రమంగా కొందరు ఇసుకను పెన్నానదిలో నుంచి రవాణా చేస్తున్నారు. కానీ పబ్లిక్ వర్కులకు (ప్రభుత్వ పనులకు) అక్రమ ఇసుకను వినియోగించలేని పరిస్థితి. చుట్టుపక్కల ఇంకా ఇసుక రీచ్‌లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. దీంతో అభివృద్ధి పనులకు ఇసుక కొరత వేధిస్తోంది.



ఇసుక లేక స్లాబ్ దశలో నిలిచిపోయిన మార్కెట్ నిర్మాణ పనులు

నిలిచిపోయిన మార్కెట్ నిర్మాణపనులు

గత రెండు నెలలుగా ఇసుక కొరతతో పట్టణంలోని శివాలయం సర్కిల్‌లో రూ.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఆధునాతన మున్సిపల్ కూరగాయల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్ పనులు నిలిచిపోయాయి. మార్కెట్ నిర్మాణ పనులు చేపడుతున్న కేసీపీ నిర్మాణ సంస్థ ఇసుక లేక స్లాబ్ కాంక్రీట్ పనులు నిలిచిపోయాయని వెల్లడిస్తున్నారు. సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. రెండు నెలలు గడిచినా ఇసుక సమస్య తీరకపోవడంతో పనులు నిలబెట్టాల్సి వచ్చిందని చెబుతున్నారు. అంతేకాకుండా ఇప్పటి వరకు కేవలం రూ.5 కోట్ల మేర మాత్రమే బిల్లులు అయ్యాయని.. ఇంకా రూ.10కోట్లపైన బిల్లులు పెండింగ్ వున్నాయని కెసీపీ నిర్మాణ సంస్థ ప్రతినిధి చలపతి వాపోయారు. కొత్త ప్రభుత్వంలో ఈ నిర్మాణ పనులకు బిల్లులు వస్తే పనులు త్వరితగతిన పూర్తి చేయగలమన్నారు.

రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

అక్రమ రవాణాలో పట్టుబడిన ఇసుక రూరల్ పోలీసు స్టేషన్‌లో టన్నులమేర ఇసుక నిల్వలు వున్నాయి. వాటిని పబ్లిక్ వర్కులకు కేటాయించేలా రెవెన్యూ అధికారులకు లెటర్ పెట్టాం. తహసీల్దారు కూడా ఆర్‌డీవోకు లెటర్ పెట్టారు. వారి నుంచి అనుమతి రాగానే ఇసుకను రూరల్ పోలీసుస్టేషను నుంచి తరలించి.. అభివృద్ధి పనులకు వాడతాం. అలాగే ఇసుక రీచ్ ఏర్పాటుకు కూడా లెటర్ పెడతాము.

- రఘునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు.

గండికోట ప్రాజెక్టులో తనిఖీ



గండికోట ప్రాజెక్టును తనిఖీ చేస్తున్న నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు

కొండాపురం, ఆగస్టు 30: గండికోట ప్రాజెక్టును నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎన్‌డబ్ల్యూడీఏ) అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఎన్‌డబ్ల్యూడీఏ సీఈ దేవేందర్ రావు, డీడీ లలిత ప్రాజెక్టును తనిఖీ చేశారు. గండికోట ప్రాజెక్టును క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రాజెక్టులో నాణ్యత, గేట్లను తనిఖీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్టుల తనిఖీలో భాగంగా వారు గండికోట ప్రాజెక్టును సందర్శించినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఈ రవికిరణ్, డీఈలు ఉమా మహేశ్వర్లు, వివేక్, చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈలు సుదర్శన్, రమణ, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

గండికోట నుంచి మైలవరానికి నీటి విడుదల పెంపు

గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి శుక్రవారం నీటి విడుదలను పెంపుదల చేసినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గురువారం మైలవరానికి 7,500 క్యూసెక్కులు విడుదల చేయగా.. 15,000 క్యూసెక్కులకు పెంచారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 19 టీయంసీలు పైగా నీరు నిల్వ ఉంది.

సమయాన్ని సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులకు సలహాలు ఇస్తున్న ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు

చక్రాయపేట, ఆగస్టు 30: సమయాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం గండి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ఎస్సీ, ఎస్టీ సెల్ తరపున ఔట్‌రీచ్ ప్రోగ్రాం నిర్వహించారు. 10వ తరగతి, ఇంటర్‌మీడియట్ విద్యార్థులకు తరగతులు నిర్వహించారు. చదువు, ఉద్యోగం, ఉపాధిలో సమయం విలువ గురించి, చదువు గొప్పదనాన్ని వివరించారు. డైరెక్టర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి గుప్త, ఎస్సీ ఎస్టీ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, అధ్యాపకులు కె.రవి, డాక్టర్ వెంకటేశ్వర్లు, లైదియ, కవిత, సత్య, విజయ్, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

మూలమల్లికార్జునరెడ్డికి జానపద సాహిత్య పురస్కారం



మూల మల్లికార్జునరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 30: జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసరు మూల మల్లికార్జునరెడ్డికి జానపద సాహిత్య పురస్కారం ఇస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షు రాలు డాక్టర్ వసుంధరరెడ్డి ప్రకటించినట్లు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్య దర్శి సుబ్రహ్మణ్యం తెలిపారు. కవిగా, రచయితగా, సాహిత్య విమర్శకుడిగా, నాట కకర్తగా, నటుడిగా, నాటక ప్రయోక్తగా మూల సాహిత్య నాటకరంగాలకు చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డు ప్రకటించడం అభినందనీయమని తెలిపారు. జానపద సాహిత్య పరిషత్, హైదరాబాదు 50 ఏళ్లగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే వార్షికో త్సవాల్లో భాగంగా సెప్టెంబరు 2న హైదరాబాదు, కూకట్‌పల్లి, క్రిష్ణ సింధూరి సంకల్ప లలిత కళా నిలయంలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డు అందజేయనున్నా రు. మూల మల్లికార్జునరెడ్డికి అవార్డు రావడం పట్ల పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



దోమల నియంత్రణపై ప్రచారంలో పాల్గొన్న మలేరియా అధికారి మనోరమ

కడప(కలెక్టరేట్) ఆగస్టు 30: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలమని జిల్లా మలేరియా అధికారి మనోరమ సూచించారు. శుక్రవారం నగరంలోని ప్రకాష్ నగర్‌లో నిర్వహించిన డ్రైడే-ఫ్రైడే కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందన్నారు. దోమల నియంత్రణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధులను అదుపు చేయవచ్చన్నారు. ప్రతి ఇంట్లో వారానికి ఒక రోజు పాత్రలు, తొట్లు, కూలర్లు, కుండలు శుభ్రంగా ఎండ బెట్టాలన్నారు. రాత్రి పూట దోమ తెరలను వాడాలన్నారు జ్వరాలు వస్తే వెంటనే ఏఎన్ ఎంలకు తెలపాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మీరెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి బాపుల్లయ్య, శంకర్ రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మైలవరం జలాశయం నుంచి నీరు విడుదల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, మైలవరం ఉత్తరకాలువకు నీటి విడుదల, బ్రహ్మంసాగర్‌లోకి చేరిన కృష్ణాజలాలు

మైలవరం, ఆగస్టు 30: మైలవరం జలాశయం నుంచి ఉత్తరకాలువకు 50 క్యూసెక్కుల నీటిని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డిలు శుక్రవారం విడుదల చేశారు. ముందుగా మైలవరం జలాశయం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గండికోట జలాశయానికి ఇప్పటికే 18 టీఎంసీల నీరు వచ్చి చేరిందని, అక్కడి నుంచి మైలవరం జలాశయానికి 7500 క్యూసెక్కుల మేర నీరు వచ్చి చేరుతోందన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న వర్షాభావం దృష్ట్యా ఉత్తరకాలువకు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని, దక్షిణ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారన్నారు. పెన్నా పరివాహక ప్రాంత ప్రజల తాగు, రైతుల సాగు నీటి కోసం ఇబ్బందులు పడకుండా చూడడమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మరో 10 రోజుల్లో పెన్నానదికి మైలవరం జలాశయం నుంచి నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జలాశయ ఈఈ పురుషోత్తం, డీఈఈ నరసింహమూర్తి, ఏఈఈ గౌతమ్‌రెడ్డి, తహసీల్దారు లక్ష్మీనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంసాగర్‌లోకి కృష్ణాజలాలు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 30: తెలుగుగంగలో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం అర్ధరాత్రి 12గంటల సమయంలో కృష్ణాజలాలు చేరాయని తెలుగుగంగ ప్రాజెక్టు అసిస్టెంటు ఇంజనీరు నాగేశ్వర్‌రావు తెలిపారు. కృష్ణాజలాలు వెలుగోడు ప్రాజెక్టు నుంచి ఎస్ఆర్-1, ఎస్ఆర్-2 పూర్తిస్థాయిలో నిండి బ్రహ్మంసాగర్‌కు వెయ్యి క్యూసెక్కులు నీళ్లు వస్తున్నాయన్నారు. అలాగే శ్రీశైలం ప్రాజెక్టులో కూడా నీరు ఎక్కువగా ఉండడంతో ఈ సారి బ్రహ్మంసాగర్‌లోకి పూర్తిస్థాయి నీటి మట్టం 15 టీఎంసీలు నిల్వ ఉంచే ప్రక్రియలో అధికారులు నిమగ్నమై ఉన్నారని.. రైతన్నలు వ్యవసాయానికి ఈ సారి పూర్తిస్థాయిలో నీటిని అందించడం జరుగుతుందని తెలిపారు.

విద్యుత్తు ఉద్యోగిపై వైసీపీ నాయకుడు దాడి - కేసు

ఒంటిమిట్ట, ఆగస్టు 30: మండల పరిధిలోని కొత్తమాధవరం గ్రామంలో విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌పై మండల వైసీపీ నాయకుడు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, కుమారుడు శ్రీకర్‌రెడ్డిలు దాడి చేశారు. బాధితుడి వివరాల మేరకు.. ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ఇంటికి సంబంధించి విద్యుత్ బకాయి దాదాపు రూ.30వేలు ఉందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెల్లించాలని అడగడంతో.. మమ్మలనే బకాయి అడుగుతావా.. అంటూ పరుష పదజాలంతో దాడి చేశారన్నారు. తనపై దాడి జరుగుతున్న దృశ్యాన్ని సెల్‌ఫోన్‌లో రికార్డు చేస్తుండగా పక్కనే ఉన్న మరికొంత మందితో కలిసి తన మొబైల్ ఫోను తీసుకున్నారని బాధితుడు తెలిపారు. దీనిపై ఏఈ ఉదయ్ కుమార్ తన సిబ్బందితో కలిసి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, కుమారుడు శ్రీకర్‌రెడ్డితో పాటు మరికొంతమందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు.

అయిదుగురికి రిమాండ్

చాపాడు, ఆగస్టు 30: మండలంలోని లక్ష్మీపేట, వీరభద్రాపురం గ్రామానికి చెందిన అయిదుగురు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసి మైదుకూరు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం భూమి తగాదా విషయమై వీరభద్రాపురం గ్రామానికి చెందిన సురేంద్రారెడ్డి, చంద్ర ఓబుళరెడ్డిలను గాయపరిచినట్లు తెలిపారు.

రేపు అండర్-14 పురుషుల క్రికెట్ ఎంపికలు

కడప (స్పోర్ట్స్) ఆగస్టు 30: నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటలకు అండర్- 14 పురుషుల క్రికెట్ ఎంపికలు జరుగనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంపికలకు తప్పక హాజరుకావాలని కోరారు. హాజరయ్యే ఔత్సాహిక క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన సర్టిఫికెట్, (ఫారమ్-5) పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో, స్టడీ సర్టిఫికెట్ ఒరిజినల్‌తో పాటు ఒక సెట్టు జిరాక్స్ కిట్ బ్యాగ్ కూడా వెంట తీసుకురావాలన్నారు. ఇందులో అండర్-14 కటాఫ్ డేట్ 2010 సెప్టెంబర్ 1 తర్వాత నుంచి 2012 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు.

నలుగురు గంజాయి విక్రేతలు అరెస్టు

కడప (క్రైం), ఆగస్టు 30: స్థానిక రైల్వేస్టేషన్ వద్ద గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. పులివెందులకు చెందిన జగదీష్, సాయి పవన్‌రెడ్డి, సయ్యద్ మున్నార్, ఇర్ఫాన్ గంజాయి అమ్ముతుండగా అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి 1 కిలో 108 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని... ఈమేరకు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆర్ట్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించిన విద్యార్థులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కోట మృత్యుంజయరావు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 30: వైవీయూ ఫైన్ ఆర్ట్స్‌శాఖ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను కడప నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు సందర్శించారు. ఈనెల 28 నుంచి సెప్టెంబరు 5 వరకు ప్రదర్శన కొనసాగుతుంది. ఆర్ట్స్ గ్యాలరీలో శిల్పకళ, చిత్రకళ, ప్రింట్ మేకింగ్, డిజైన్‌లను విద్యార్థులు తిలకించారు. ఫైన్‌ఆర్ట్స్ శాఖ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు విద్యార్థులకు కళల గురించి పరిచయం చేశారు. చిత్రకళ, శిల్పకళ అవకాశాల గురించి అవగాహన కల్పించారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

అరకొర వసతులు.. అయినా ఫలితాల్లో టాపర్లు

- వేధిస్తున్న అధ్యాపకులు, తరగతి గదుల కొరత
- 16 సంవత్సరాలుగా గెస్ట్ లెక్చరర్లతో విద్యాబోధన
- అయినా.. ఎనిమిదేళ్లుగా ప్రతిభ చాటుతున్న విద్యార్థులు
- ఉర్దూ జూనియర్ కళాశాల దుస్థితిపై తల్లిదండ్రుల ఆవేదన



ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల ముఖద్వారం, అధ్వానంగా ఉన్న కళాశాల తరగతి గదులు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 30: ఆ కళాశాలలో అరకొర వసతు లున్నా.. అధ్యాపకల కొరత వేధిస్తున్నా.. విద్యార్థులు మాత్రం ఎనిమిదేళ్లుగా జిల్లా టాపర్లుగా నిలుస్తున్నారు. కళాశాలలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తే మరింత ప్రతిభ కనబరుస్తామని ఉర్దూ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ముస్లిం మైనార్టీ నాయకుల వినతి మేరకు 2008లో వసంతపేటలోని 18వ వార్డు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం ఉర్దూ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసింది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులతో ఉర్దూ ఇంగ్లీషు మీడియంలో బోధన చేస్తున్నారు. ప్రొద్దుటూరుతో పాటు జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, రాజుపాళెం, చాపాడు, కమలాపురం, చిన్నచెప్పలి, వెలువలి, కానగూడూరు, ఖాదర్‌పల్లి వంటి దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు కళాశాలకు వస్తున్నారు.

ప్రస్తుతం కళాశాలలో మొదటి సంవత్సరం 86 మంది,ద్వితీయ సంవత్సరంలో 96 మంది విద్యార్థులు ఉన్నారు. కళాశాలలో చదివిన విద్యార్థులు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, చార్టెడ్ అకౌంట్లుగా ఉద్యోగాలు చేస్తుండడంతో కళాశాలలో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. అయితే కళాశాలలో తరగతి గదులు, అధ్యాపకుల కొరతను దృష్టిలో ఉంచుకుని కళాశాలలో చేరడానికి విద్యార్థులు కాస్త జంకుతున్నారు.

16 సంవత్సరాలుగా అరకొర వసతులతోనే....

కళాశాల ఏర్పాటై 16 సంవత్సరాలు అయినా.. తగిన వసతులు లేకపోయినా.. విద్యార్థులు విద్యపై ఆసక్తితో సర్దుకు పోతున్నారు. కళాశాలలో ఇప్పటికీ ప్రిన్సిపల్ పోస్టు ఒక్కటే రెగ్యులర్ కాగా.. అధ్యాపకులందరు గెస్ట్ లెక్చలర్లుగా పనిచేస్తున్నారు. బాటనీ, ఫిజిక్స్ బోధించడానికి అధ్యాపకులు లేరు. అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని ఎన్నిసార్లు అధికారులను కోరినా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు ఆడుకోవడానికి ఆట స్థలంకానీ, ప్రయోగాలు చేసుకోవడానికి ల్యాబ్‌లు లేవు.

సొంత భవనాలు నిర్మించాలి



పాఠశాల ఆవరణలో కళాశాలను ఏర్పాటు చేశారు. గదుల కొరతతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా కళాశాలకు సొంత భవనాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలి.

- షేక్ అల్తాఫ్, సీఈసీ ద్వితీయ సంవత్సరం

రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలి



కళాశాల ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇంతవరకు రెగ్యులర్ అధ్యాపకులు లేరు. గెస్ట్ లెక్చలర్లతో బోధన జరుగుతోంది. రెగ్యులర్ అధ్యాపకులను నియమిస్తే ఉత్తమ ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంది.

- షాహిదా, ఎంపీసీ, ద్వితీయ సంవత్సరం

బాత్‌రూములు లేవు



కళాశాలలో అవసరమైన బాత్‌రూములు, మరుగుదొడ్లు లేవు. కళాశాల మొత్తానికి ఒక్క బాత్‌రూము, మరుగుదొడ్డి ఉండడంతో కష్టంగా ఉంది.

- ఆదిల్, సీఈసీ ద్వితీయ సంవత్సరం

వేధిస్తున్న తరగతి గదుల సమస్య

కళాశాలలో తగినన్ని తరగతి గదులు లేకపోవడంతో వరండాలో తరగతులు నిర్వహిస్తున్నారు. గదులు ఇరుకుగా ఉండడంతో పక్క గదిలో అధ్యాపకుని బోధనలు, విద్యార్థుల అల్లర్లు వినపడకుండా కిటికీలు వేసుకుని పాఠాలు వినాల్సిన పరిస్థితి. వసంతపేటకు వెళ్లే ప్రధాన రోడ్డుకు ఆనుకుని కళాశాల ఉండడంతో ఆ రోడ్డున వెళ్లే వాహనాల శబ్ద కాలుష్యంతో విద్యార్థులు బోధనపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఒక తరగతి గదిని స్వాధీనం చేసుకోవడంతో ఆరుబయట తరగతులు నిర్వహిస్తున్నారు.

జిల్లా టాపర్లుగా నిలుస్తున్న విద్యార్థులు

అధ్యాపకుల కొరతతో తగిన వసతులు లేకపోయినా పరీక్షా ఫలితాల్లో కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరుస్తున్నారు. జిల్లాలో అయిదు ఉర్దూ జూనియర్ కళాశాలలు ఉండగా 8 సంవత్సరాలుగా కళాశాల విద్యార్థులు జిల్లా టాపర్లుగా నిలుస్తున్నారు. కళాశాలకు శాశ్వత భవనాలు నిర్మించి రెగ్యులర్ అధ్యాపకులు, ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని విద్యార్థులు కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వివాదాలు రేకెత్తించే నిర్మాణాలు చేపట్టవద్దు

అవి ఎలాంటివైనా తొలగిస్తాం : సీఐ పురుషోత్తంరాజు



పెన్నానదిలో దర్గా పక్కన నిర్మిస్తున్న గోడను పరిశీలిస్తున్న సీఐ పురుషోత్తంరాజు

చెన్నూరు, ఆగస్టు 30: అనుమతి లేకుండా ఇష్టానుసారంగా ఎక్కడ పడితే అక్కడ నిర్మాణాలు చేపడితే వాటిని నిర్దాక్షిణ్యంగా తొలగిస్తూ సంబంధీకులపై కేసులు నమోదు చేస్తామని సీఐ పురుషోత్తంరాజు హెచ్చరించారు. వనంవీధిలోని నిజాముద్దీన్ దర్గాకు ఉత్తరం వైపు పెన్నానదిలో ఇటీవల చెన్నూరుకు చెందిన ఓ వ్యక్తి ప్రహరీ, మరుగుదొడ్లు, స్నానం గదులు నిర్మాణం చేపట్టారు. దీంతో స్థానికులు పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి దృష్టికి తీసుకపోగా ఆయన సీఐకి తెలిపారు. అంతేకాక వనంవీధి, చెన్నూరు యువత ఆప్రాంతానికి చేరుకుని ఇక్కడ నిర్మాణాలు చేపట్టేదెవరు, ఎందుకు చేపడుతున్నారు, అనుమతులపై ఆరా తీశారు. అంతేకాకుండా నదిలో ఎలా కడతారని గట్టిగా ప్రశ్నించారు. పంచాయతీ కార్యదర్శి, సీఐలు ఆ కట్టడాలను పరిశీలించారు. వీటిని తక్షణం తొలగించాలని పంచాయతీ సిబ్బందికి సీఐ తెలపడం, ఇలాంటి వాటి వల్ల వివాదాస్పద సమస్యలు తలెత్తుతాయన్నారు. ఇప్పటికే చెన్నూరులో ఓ సమస్యతో రెండు వర్గాల్లో రెచ్చగొట్టేలా ఉందని, ఇప్పుడు మరలా అదే సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ నెల కిందటే నిర్మాణాలు చేపట్టకూడదని తాను హెచ్చరించానని, అయినా నిర్మాణాలు చేపట్టడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్మాణాలతో తాగునీటి పైపులైనుకు దోబిఘాట్‌కు ఇబ్బందికంగా ఉంటుందని తక్షణం తొలగించకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆందోళనకు దిగిన యువతకు సీఐ సర్దిచెప్పి పంపారు. ఇలాంటి విషయాలు ఏమైనా జరిగితే ముందుగా తన దృష్టికి తేవాలని చెప్పడం జరిగింది.

కన్నులవిందుగా కృష్ణుడి ఊరేగింపు



కడప (కల్చరల్), ఆగస్టు 30: కృష్ణజన్మాష్టమి వేడుకలు ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యం లో కడప నగరంలో 26న సోమవారం నుంచి 30 శుక్రవారం వరకు ఘనంగా నిర్వహించారు. జన్మాష్టమి నుంచి రోజూ పూజా కార్యక్రమాలు భగవద్గీత శ్లోకాల పఠనం చేశారు. శుక్రవారం ఉదయం కృష్ణ పరమాత్ముల వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు కృష్ణుని దర్శించుకుని తరించారు. అన్నదానం చేశారు. మధ్యాహ్నం 2గంటల నుంచి రాత్రి వరకు అక్కాయపల్లె, తిలక్‌నగర్, చౌటపల్లిరోడ్డు నుంచి ఐటీఐ కూడలి, బాలాజీనగర్ మీదుగా కృష్ణుని పల్లకీపై భక్తులు మోస్తూ గోవిందనామస్మరణలతో ఊరేగించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి కడప నగర అధ్యక్షుడు నవనీశ్వర్‌రెడ్డి సభ్యులు ఈశ్వర్, సామ్రాట్, సదానంద వాసంతి తదితర సభ్యులు, భక్తులు, మహిళా మూర్తులు, పెద్దలు పిల్లలు పాల్గొన్నారు.

'ఏకీకృత పెన్షన్ పథకం అంగీకరించం'

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 30: కేంద్రప్రభుత్వం ప్రకటించిన యూపీఎస్ పథకాన్ని అంగీకరించేదేలేదని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, పాలెం మహేశ్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక డీఈఓ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన చేపట్టిన వారు మాట్లాడుతూ ఉద్యోగులను తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం కేవలం ఎంపీఎస్ పేరును యూపీఎస్‌గా మార్చిందన్నారు. 25 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులకు 50 శాతం పెన్షన్ గ్యారంటీ చేస్తున్నట్లు సర్వీసులో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 60 శాతం ఫ్యామిలీ పెన్షన్ ఇస్తామని యూపీఎస్ పెన్షన్ విధానంలో కేంద్రం ప్రకటించినా ఉద్యోగుల కంట్రిబ్యూషన్‌తో కూడిన పెన్షన్ పథకాన్ని రద్దు చేసే విషయాన్ని ఇందులో ప్రస్తావించకపోవడం ఈ పథకం అమలులో ఐచ్ఛికం అని పేర్కొనడంలోనే అసలు మోసం దాగి ఉందన్నారు. ఉద్యోగుల కంట్రిబ్యూషన్ లేకుండా సర్వీసును బట్టి 50శాతం ఇచ్చే పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడమే తమకు ఆమోదయోగ్యమన్నారు.

నిబంధనల ప్రకారం గణేశ్ ఉత్సవాలు

పోలీసు, ఫైర్, కార్పొరేషన్ అనుమతులు తప్పనిసరి ● ప్రభుత్వ ఆస్తులకు భంగం కలిగించరాదు

కమిషనర్ వైఓ నందన్



సమావేశంలో మాట్లాడుతున్న కడప నగర పాలక కమిషనరు వైవో నందన్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 30: కడప కార్పొరేషన్ పరిధిలో నిబంధనల ప్రకారం గణేశ ఉత్సవాలు చేసుకోవాలని కమిషనర్ వైవో నందన్ సూచించారు. గణేశ్ ప్రతిమలు పెట్టేటప్పుడు పోలీసు, ఫైర్, కార్పొరేషన్ అనుమతులు తప్పనిసరన్నారు. ప్రభుత్వ ఆస్తులకు రోడ్లకు ఎటువంటి భంగం కలిగించకూడదన్నారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం కార్పొరేషన్ సమావేశ మందిరంలో టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, పబ్లిక్‌హెల్త్, రెవెన్యూ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణపై టౌన్‌ప్లానింగ్ విభాగం ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనల ప్రకారం గణేశ్ ప్రతిమలు పెట్టుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. గణేశ్ ప్రతిమలు పెట్టుకునే వారు తప్పకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పందిళ్లు వేయాలన్నా రోడ్లు, ప్రభుత్వ ఆస్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఆస్తులు, రోడ్లను డ్యామేజీ చేసినట్లయితే మరమ్మత్తులు చేసేలా చర్యలు తీసుకోవాలని లేదంటే వారిపై జరిమానా వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గణేశ్ ఉత్సవాలకు రెండు రోజుల ముందుగానే శానిటేషన్ అధికారులు వారికి కేటాయించిన ప్రాంతమంతా శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఫాగింగ్, బ్లీచింగ్ చేయాలని సూచించారు. అనంతరం నిమజ్జనానికి కేటాయించిన స్థలాల్లో అధికారులకు విధులు కేటాయించాలన్నారు. ప్రతిమల నిమజ్జనం కోసం ప్రత్యేక రూట్‌మ్యాప్ ఏర్పాటు చేసి వారికి కేటాయించిన ప్రాంతాల్లో నిమజ్జనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. 3, 5, 7, 11 రోజుల్లో నిమజ్జనం చేస్తారు కాబట్టి ఊరేగింపు మార్గాల్లో కరెంటు తీగలు, కేబుల్ వైర్లు అడ్డురాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అధికారులంతా చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని దీనికి సంబంధించిన ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో అడిషనల్ కమిషనరు రాకేశ్ చంద్రన్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ సూరజ్, ఎంఎహెచ్‌ఓ చంద్రశేఖర్, ఈఈ ధనలక్ష్మి, మేనేజరు వెంకటరామిరెడ్డి, సూపరింటెండెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొల్హాపూర్ మహాలక్ష్మిగా వాసవీమాత

వేంపల్లె, ఆగస్టు 30: స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కొల్హాపూర్ మహాలక్ష్మిగా వాసవిమాత భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసం 4వ శుక్రవారం సందర్భంగా ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అర్చకులు ప్రసాద్‌శర్మ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సురేంద్ర, మహిళా మండలి అధ్యక్షురాలు ప్రవీణ, సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రతిభ

వేంపల్లె, ఆగస్టు 30: తెలుగు మాతృభాష దినోత్సవ జిల్లా స్థాయి లో జరిగిన పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని కల్పన ప్రతిభ కనబరిచి బహుమతి సాధించింది. కలమల్లలో జరిగిన మాతృభాషా దినోత్సవాల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కలెక్టర్ లోతేటి శివశంకర్ నుంచి ప్రశంసాపత్రం బహుమతి అందుకున్నట్లు తెలుగు విభాగాధిపతి డాక్టర్ నాగలక్ష్మీదేవి తెలిపారు. ప్రిన్సిపాల్ యోగాంజనేయులు, అధ్యాపకులు, కల్పనను అభినందించారు.

'వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి'

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 30: జిల్లాలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హాస్టలు వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని పీఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనరు నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏఓ విజయకుమార్‌ను కలిసి వినతిపత్రం అందించిన ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు ఎస్సీ హాస్టల్-2లో 30మంది వరకు విద్యార్థులున్నారన్నారు. హాస్టల్‌లో సంఖ్య పెంచేందుకు వార్డెన్ చర్యలు తీసుకోవడంలేదని ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ హాస్టలు వార్డెన్ దగ్గరలో ఉన్న వారికి భర్తీ చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో పీఆర్‌ఎస్‌వైఎఫ్ నాయకులు విష్ణు, తరుణ్ పాల్గొన్నారు.

సమస్యల నిలయాలు - గురుకులాలు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 30: సమస్యలకు నిలయంగా అంబేడ్కర్ గురుకుల పాఠశాలలున్నాయని ఏఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి నాగరాజు తెలిపారు. శుక్రవారం ఏఐఎస్‌యూ ఆధ్వర్యంలో డీసీఓ మాధవీలతకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలో పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్స్ సమస్యలకు నిలయంగా మారాయన్నారు. హాస్టల్స్‌లో మెనూ అమలు చేయడంలేదని విద్యార్థినులకు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. హాస్టల్స్‌లో ప్రిన్సిపాల్స్ నియమనిబంధనలు పాటించకుండా విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారన్నారు.

కడప లీగల్ సెల్ అథారిటీకి ముగ్గురు సభ్యుల నామినేషన్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 30: కడప జిల్లా లీగల్ సర్వీసెస్ సెల్ (డీఎల్ఎస్ఏఎస్)కు ముగ్గురు సభ్యులను నామినేట్ చేస్తూ ప్రభుత్వం గెజిట్ ఉత్తర్వులు జారీ చేసింది. కడప లీగల్ సెల్‌కు సంబంధించి సామాజిక కార్యకర్త విభాగంలో కడప వాస్తవ్యుడు పొడిపిరెడ్డి రామారావు కుమారుడు పి.వి.ఎస్.యు.బి. ప్రభు (బీసీ-డి), ప్రముఖ వ్యక్తుల విభాగం నుంచి ఎన్జీవో కాలనీవాసి నాగరాజ రెడ్డి కుమారుడు జి.వి. కల్యాణ్ రెడ్డి (ఓసి), న్యాయ వ్యవహారాల అమల్లో ఆసక్తి కలిగిన వ్యక్తిగా జానుమద్ది హనుమచ్ఛాస్త్రి కుమారుడు జానుమద్ది విజయ భాస్కర్ (ఓసి)ను నియమించారు. ఈ ముగ్గురు నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి రెండేళ్లు కొనసాగుతారని ప్రభుత్వ న్యాయ, శాసన సభ వ్యవహారాల శాఖ కార్యదర్శి వి. సునీత జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

యాదవ యువతకు చేయూతనందించాలి

ఏపీ జీఎంపీఎస్ ఆవిర్భావ సభలో నేతలు

కడప (మారుతీనగర్) ఆగస్టు 30: కుల వృత్తితో జీవిస్తున్న యాదవ యువతకు సొసైటీల్లో సభ్యత్వం కల్పించి చేయూత నివ్వాలని రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం దారుల సమాఖ్య (ఏపీ జీఎంపీఎస్) నేతలు పాలక ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏపీ జీఎంపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఓబులేసుయాదవ్ అధ్యక్షతన ఆవిర్భావ సభలో ఆయన మాట్లాడుతూ మూగజీవాలైన గొర్రెలు, మేకలను తమ పిల్లలుగా భావించి వాటి కాపలాదారులుగా యాదవులు తండ్రి పాత్ర పోషిస్తున్నారని గుర్తుచేశారు. అలాంటి వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయ సహకారాలు అందించాల్సిన అవసరముందన్నారు. సబ్సిడీ రుణాలపై యాదవులకు అవగాహన కల్పించి తద్వారా లబ్ధిదారులకు పాలక ప్రభుత్వాలు రుణాలు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా 50 ఏళ్లు దాటిన కాపర్లకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. అర్హులైన యాదవ కాపరులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఏదేని ప్రమాదవశాత్తు మరణించిన కాపర్లకు రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నేతలు గంగాదేవి గంగయ్య యాదవ్, త్రివిక్రమ్ యాదవ్, కొప్పల శివయాదవ్, రెడ్డయ్య యాదవ్, అయ్యవారయ్య, నాగమల్లయ్య, శ్రీనివాసులు, ఉక్కాయపల్లె శ్రీనివాసులు, కిరణ్, శరత్, నాగార్జున, రాజన్న, మల్లికార్జున, పుల్లయ్య, బాలకృష్ణ, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ కాస్మెటిక్ చార్జీలు చెల్లించాలి'

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 30: ప్రభుత్వ వసతిగృహాల్లో పెండింగ్ మెస్, కాస్మెటిక్ చార్జీలు వెంటనే చెల్లించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో బీసీ సంక్షేమ అధికారి భరత్‌కుమార్‌కు వినతిపత్రం అందించిన ఆయన మాట్లాడుతూ 9 నెలలుగా పెండింగ్‌లో ఉన్న కాస్మెటిక్, మెస్ చార్జీలు చెల్లించకపోవడంతో విద్యార్థులు వసతిగృహ అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పీడీఎస్‌యూ నేతలు స్వరూప్‌తేజ, వంశీరెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

కాలినడకన అంజన్న భక్తులు

వీరపునాయునిపల్లె,ఆగస్టు 30: ప్రొద్దుటూరుకు చెందిన అంజన్న భక్తులు వీరపునాయునిపల్లె మీదుగా గండి క్షేత్రానికి కాలినడకన వెళ్లారు. అంజన్న దర్శనంకోసం కాలినడకన మహిళలు బయలుదేరి వెళ్లారు. ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, పెద్దనపాడు, ఉరుటూరు, గంగిరెడ్డిపల్లె, వీరపునాయునిపల్లె, వేంపల్లె మీదుగా గండికి చేరుకుంటారు.

వీరపునాయునిపల్లెలో వర్షం

వీరపునాయునిపల్లె, ఆగస్టు 30: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం చిన్నపాటి వర్షం కురిసింది. ఉక్కపోతతో అల్లాడుతున్న తరుణంలో ఒక్కసారిగా మోస్తరు వర్షం కురవడంతో కొంతమేర ఉక్కపోత తగ్గిందని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ముగ్గురి పెన్షన్లు రద్దు

చెన్నూరు, ఆగస్టు 30: మండలంలో శనివారం పంపిణీ చేయనున్న వితంతు, వికలాంగ వృద్ధాప్య పింఛన్లకు సంబంధించి ముగ్గురు వికలాంగులు తప్పుడు ధృవీకరణ పత్రాలు పొందారని ఇటీవల జరిగిన సర్వేలో బయట పడడంతో వారికి పెన్షన్లు రద్దు చేసినట్లు ఎంపీడీఓ సుదర్శనశర్మ తెలిపారు. చెన్నూరు, బయనపల్లె, బలసింగాయ పల్లె వాసులుగా గుర్తించామన్నారు.

ఘనంగా వరలక్ష్మీవ్రతం



సికెదిన్నె, ఆగస్టు 30: శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీమాతకు మహిళలు ఘనంగా పూజలు నిర్వహించారు. వరాలు ఇచ్చే దేవతగా వరలక్ష్మీమాతను మండల ప్రజలు ప్రత్యేక అలంకరణలో ముస్తాబు చేసి వరలక్ష్మి నోము నోచుకుని పూజలు నిర్వహించారు. శ్రావణ మాసంలో శుక్రవారాలు వరలక్ష్మీ వ్రతం నిర్వహించుకుంటూ వస్తున్న మహిళలు చివరి శుక్రవారం భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

బాధ్యతలు చేపట్టిన సీఐ భాస్కర్‌రెడ్డి



కడప (క్రైం), ఆగస్టు 30: కడప సీసీఎస్ ఇన్‌స్పెక్టరుగా సి.భాస్కర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఈయన ఎస్ఐగా, సీఐగా జిల్లాలోని పలు పోలీసుస్టేషన్లలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం కడప వన్‌టౌన్ సీఐగా పనిచేస్తూ బదిలీపై సీసీఎస్‌కు వచ్చారు. కడప నగరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ సీఐగా ఏపీ మస్తాన్‌వలి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

అలవెన్స్‌లను పునరుద్ధరించాలి

పులివెందుల టౌన్, ఆగస్టు 30: డ్రైవర్, కండక్టర్లకు ఈనెల జీతంలో కలపకుండా నిలిపేసిన నైట్ అవుట్ అలవెన్స్‌లను జీఓ ప్రకారం పునరుద్ధరించాలని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. ధర్నాలో అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పీఎస్ఎన్ రావు, జోనల్ కార్యవర్గ సభ్యులు రామలింగారెడ్డి, డిపో అధ్యక్షుడు సిపిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎంరెడ్డి, డిపో కార్యదర్శి ఆర్‌కెరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

హైస్కూలు ప్లస్ పాఠశాలలకు సర్దుబాటు చేయాలి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 30: బోధన నిలిచిపోయే పరిస్థితి తలెత్తకుండా తక్షణం సర్దుబాటు చేయాలని పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. హైస్కూలు ప్లస్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిందని, ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేసి ఉండడం వల్ల బోధన నిలిచిపోయే పరిస్థితి ఉందన్నారు. అయితే హైస్కూలు ప్లస్ పాఠశాలలకు మాత్రమే ఉపాధ్యాయుల సర్దుబాటును నిలిపివేయడం శోచనీయమన్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగితే సంఖ్య ఆధారంగా సర్దుబాటు చేయాలే తప్ప నిలిపివేయడం సమంజసం కాదన్నారు.

అలసత్వం బాధాకరం

ఆర్టీసీ ఎన్ఎంయూ నేతల నిరసన

కడప (మారుతీనగర్), ఆగస్టు 30: కడప రీజియన్ వ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించడంలో సంబంధిత అధికారులు అలసత్వం వహించడం బాధాకరమని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నేతలు అన్నారు. ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక కడప డిపోలో మొదటి సర్వీసు నుంచి నల్లబ్యాడ్జిలతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నేతలు నారాయణ, సుబ్బారావు, శ్రీనివాసులు, కేఆర్‌రెడ్డి, మల్లేశ్, నిజాముద్దీన్, సారధి తదితరులు పాల్గొన్నారు.

'కలెక్టరు కృషి అభినందనీయం'

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 30: కలమల్లలో తొలి తెలుగు శాసనాలను వెలుగులోకి తీసుకువచ్చి అక్కడ తెలుగుభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడంలో కలెక్టరు శివశంకర్ కృషి అభినందనీయమని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి అన్నారు. కలమల్లలో తొలి తెలుగుశాసనం ఎన్నో ఏళ్లగా ఉన్నప్పటికీ ఆ ప్రాంతానికి ఆలనా పాలన కరువైందని తెలుగుభాషాభిమాని అయిన కలెక్టరు తెలుగు జాతికి గర్వకారణమైన శాసనం ప్రాశస్త్యాన్ని తెలియజేయడానికి అక్కడ తెలుగుభాషా దినోత్సవాన్ని జరపాలని తలపెట్టడం గొప్ప విషయమన్నారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మరెందరినో వేదికపైకి తీసుకువచ్చి మారుమూల గ్రామానికి పేరుప్రఖ్యాతులు తెచ్చి పెట్టారని కొనియాడారు.

జోరు వాన



కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 30: సుమారు నాలుగు వారాల తరువాత వాన కురిసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా శుక్రవారం జిల్లా అంతటా అక్కడక్కడా వానలు కురిశాయి. కుండపోతగా వానకురవడంతో కడప నగరంలో కొన్నిచోట్ల జలమయమైంది. శుక్రవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కబోత కొనసాగింది. సాయంత్రం 4గంటల నుంచి ఒక్కసారిగా వాతావరణం మారింది. వర్షం మొదలైంది. ప్రధానంగా కొత్తబస్టాండు, హోమియోపతి కాలేజీ రోడ్డు సహా పలు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచి ప్రజలు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

1 నుంచి సీపీఐ దేశవ్యాప్త ఆందోళన

- సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర



కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 30: నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపరచాలని డిమాండ్ చేస్తూ సీపీఐ దేశవ్యాప్త ఆందోళనను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. దీనికి తోడు పెట్రో ధరలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా పెంచిందన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల వస్తువులు ఇవ్వాల్సిన ప్రభుత్వం బియ్యంతోనే సరిపెడుతోందన్నారు. అధికధరలను అరికట్టి పెరిగిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ 1 నుంచి 6 వతేదీ వరకు రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో జరిగే సీపీఐ ప్రజాందోళనలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యవర్గసభ్యులు బి.రామయ్య, ఎల్.నాగసుబ్బారెడ్డి, వెంకటశివ, వీరశేఖర్, చంద్రశేఖర్, సుబ్బరాయుడు, సుబ్బారెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

నూతన టెండర్లను రద్దు చేయాలి : ఆర్‌సీపీ

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 30: మార్కెట్‌యార్డు నష్టాల్లో ఉందనే కారణంతో 23 ఏళ్లుగా యార్డులో స్వీపరుగా పనిచేస్తున్న 11 మంది కార్మికులను తొలగించాలని చూడడం సరికాదని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం యార్డులోని ఏడీ, జేడీ కార్యాలయంలో తమ ప్రతినిధులు, యార్డు స్వీపర్స్, హమాలీలతో కలిసి ఆందోళన చేపట్టి జేడీకి వినతిపత్రం అందించిన ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డు ఆదాయం పెంపు కోసం సంబంధిత అధికారులు పునరాలోచించాలన్నారు. ఉన్న వారిని కాదని, యార్డులో పనిచేయడానికి గుత్తేదారులను టెండర్లకు పిలిచి వారికి కట్టబెట్టడాన్ని వ్యతిరేకించారు.

యాక్టివ్ కావాలి - వార్డుల్లో తిరగాలి

కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ వరప్రసాద్ హితబోధ

పులివెందుల రూరల్, ఆగస్టు 30: ఇకపై మనమంతా యాక్టివ్ కావాలి, వార్డుల్లో తిరిగి సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించేలా కృషిచేద్దామని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ కౌన్సిలర్లకు హిత బోధ చేశారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ హాలులో సాధారణ సమావేశంలో అజెండాలోని 45 అంశాలను చదివి వినిపించారు. తాగునీరు, వీధిలైట్లు, మ్యాన్‌హోల్స్, మురుగునీటి సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత ఇంజనీర్లు చొరవ చూపాలన్నారు. జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో అర్హులకు మాత్రమే ఇళ్లు కేటాయించామన్నారు. ఇప్పుడు వారి ఆర్థిక పరిస్థితి మారిఉండవచ్చు, రూ.8వేలు జీతం వచ్చే వారికి కూడా ఇళ్లు రద్దు చేయడం అన్యాయమన్నారు. సమావేశానికి ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి వచ్చి ఉంటే ప్రశ్నించేవారమన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న కమిషనర్ రమణారెడ్డిని సత్కరించారు. వైస్ చైర్మన్లు వైఎస్ మనోహర్‌రెడ్డి, హఫీజుల్లా, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా వాణిజ్య అధ్యక్షుడిగా దొంతు సుమన్

వేంపల్లె, ఆగస్టు 30: బీజేపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడిగా వేంపల్లెకు చెందిన దొంతు సుమన్‌కుమార్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి శుక్రవారం నియామకపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు గాలి హరిప్రసాద్, సుష్మ,భాస్కర్, నాగరాజు, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన నీరు అందించడమే ధ్యేయం

● కేంద్ర పరిశీలన బృందం రామ్ సేన్ మ్యాగీ



మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు రామ్ సేన్‌మ్యాగీ, వెంకటేశ్వర్లు

చెన్నూరు, ఆగస్టు 30: దేశవ్యాప్తంగా ప్రతి గ్రామానికి ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు అందించాలన్నదే కేంద్రప్రభుత్వ ధ్యేయమని కేంద్రపరిశీలన బృందం రిటైర్డ్ సీఈఓలు రామ్‌సేన్ మ్యాగీ, వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలో గతంలో మంజూరు చేసిన జల్‌జీవన్ మిషన్, స్వచ్ఛభారత్ మిషన్ అమలుపై ఆరా తీశారు. కేంద్ర పరిశీలన బృందం శుక్రవారం గుర్రంపాడు, చెన్నూరు గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో సిబ్బంది, ప్రజలతో మాట్లాడారు. గతంలో జల్‌జీవన్ పథకం మంజూరైనా అర్ధంతరంగా ఆగిపోవడం, పలుచోట్ల నిధులు లేక నిలిపివేశారని పంచాయతీ సిబ్బంది ప్రజలు చెప్పారు. ఇంటింటికీ కుళాయిలు ఇస్తున్నామన్న పేరుతో నిధులు వసూలు చేస్తారా, అది ఉచితమే కదా అని ప్రజలు ప్రశ్నించారు. జల్‌జవన్ మిషన్ కేంద్ర పథకమైనా అందులో పంచాయతీ పన్నులతో కలిపి వాటర్‌ట్యాక్స్ వసూలు చేస్తామని ఆ పన్నులో నీటి వాటాను వేరు పరిచి తిరిగి జల్‌జీవన్ మిషన్ పథకానికి ఆ నిధులు తిరిగి ఇస్తామన్నారు. ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడీలు వారి ప్రాంత పరిధిలో తాగునీటిని తరచూ పరీక్షించి నివేదికను ఉన్నతాధికారులకు పంపి అందులో ఫ్లోరైడ్ శాతం ఏమన్నా ఉంటే తెలియజేయాలని, లేకుంటే అలాగే నీటి సరఫరా అందించాలన్నారు. చాలా గ్రామాల్లో డైరెక్టు పంపింగ్ స్కీం ఉందని, ప్రతి పంచాయతీలో వాటర్‌ట్యాంకు ఖచ్చితంగా నిర్మించి తీరాలన్నారు. తద్వారా ఆ నీటిలో క్లోరినేషన్ చేస్తే స్వచ్ఛమైన నీరు అందుతుందన్నారు. జల్‌జీవన్ మిషన్ సంబంధించి వైద్యసిబ్బంది, పంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. తమకు ఎన్నో ఏళ్లగా వేతనాలు పెంచలేదని, ఇప్పటికైనా వేతనాలు పెంచి ఆదుకోవాలని సిబ్బంది విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ మురళి, ఏఈ వినోద్, ఈఓఆర్డీ సురేశ్‌బాబు, పంచాయతీ సర్పంచ్‌లు వెంకటసుబ్బయ్య, చల్లా ప్రమీలమ్మ, కార్యదర్శులు రామసుబ్బారెడ్డి, పరమేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పిండి వంటకాల అలంకరణలో దుర్గమ్మ



బద్వేలు రూరల్, ఆగస్టు 30 : స్థానిక సబ్‌జైలు ఆవరణలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం పిండివంటకాలతో ప్రత్యేక అలంకరణలో దుర్గామాత భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా దుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని పిండి వంటకాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మవారికి అష్టోత్తరం



పోరుమామిళ్ల, ఆగస్టు 30 : శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా పోరుమామిళ్లని వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి మూల విరాట్ అమ్మవారికి బంగారు చీరతో అలంకారం, 108 చీరలతో అష్టోత్తర కార్యక్రమం ఆర్య వైశ్యసంఘం ఆధ్వర్యంలో మహిళాసంఘాలు నిర్వహించారు. శుక్రవారం వారు అమ్మవారిని అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు విశ్వనాధుల ప్రసాద్, మహిళా మండలి అధ్యక్షురాలు రాధ తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 30: విజయనగరం వీధిలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలు, రంగు రంగుల పూలమాలలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారికి కాయాకర్పూరం సమర్పించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఏమారితే ప్రమాదమే..!



జమ్మలమడుగు, ఆగస్టు 30: జమ్మలమడుగులోని ప్రొద్దుటూరు రోడ్డులో మద్యం షాపు ఎదురుగా డివైడర్ మధ్యలో డ్రైనేజీ గుంతకు కప్పులేదు. ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రోడ్డుకు ఇరువైపులా బస్సులు, ద్విచక్ర వాహనాలు తదితర వాహనాలు వేగంగా వెళుతుంటాయి. డివైడర్ రాళ్ల సైతం పగిలిపోయాయి. ఏమారితే ద్విచక్ర వాహనాలుగానీ, రాత్రి సమయాల్లో కుక్కలు, ఆవులు పడే అవకాశం ఉంది. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ గుంతపై కప్పు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్వానంగా కూరగాయల మార్కెట్

- రోడ్లపైనే వేస్తున్న కూరగాయల వ్యర్థాలు
- అంతర్గత రోడ్లపై పేరుకున్న మట్టి, కూరగాయల వ్యర్థాలు
- సకాలంలో క్లీనింగ్ చేయని శానిటరీ సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న ప్రొద్దుటూరు ప్రజలు

ప్రొద్దుటూరు, ఆగస్టు 30 : ప్రొద్దుటూరు మున్సిపల్ తాత్కాలిక కూరగాయ ల మార్కెట్‌లో వ్యాపారులు కూరగాయలను ఇష్టారాజ్యంగా రోడ్లపై పడవేస్తున్నారు. దీంతో పచ్చి కూరగాయల వ్యర్థాలు రోడ్లపై అపరిశుభ్రతను కలిగించడమే కాకుండా దుర్వాసనను వెదజల్లుతున్నాయి.తెల్లవారుజామున వాహనాల్లో వచ్చే పచ్చికూరగాయలు అన్‌లోడ్‌చేయండా కింద పడ్డవే కాకుండా కూరగాయల్లో దెబ్బతిని చెడిపోయినవన్నీ రోడ్ల పైనే వ్యాపారులు వేయడం వలన మార్కెట్ అపరిశుభ్రంగా మారుతోంది. ప్రతి వ్యాపారి తన దుకాణంలో పోగయ్యే పచ్చివ్యర్థాలను చెత్త బుట్టపెట్టుకుని వాటిలో పాడయి దెబ్బతిన్న కూరగాయలు వేసి మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బందికి అందజేయాలి.కానీ మార్కెట్‌లో ప్రతి దుకాణం ముందు రోడ్లపైన పాడయిపోయిన, దెబ్బతిన్న కూరగాయలను పడేస్తున్నారు. అంతేకాకుండా మార్కెట్ ముందు వున్న చిన్న గార్డెన్‌లో కూడా కుళ్లిన కూరగాయలను బాక్సలనుంచి వేరుచేసి వేస్తున్నారు.దీంతో గార్డెన్ సైతం అపరిశుభ్రంగా మారుతోంది. ప్రతిరోజు శానిటరీ సిబ్బంది, వ్యాపారులు చేసే అపరిశుభ్రతను బాగుచేయాలి. మార్కెట్



మార్కెట్‌లో రోడ్డు మీద పచ్చికూరగాయల వ్యర్థాలు

అసోసియేషన్ వున్నప్పటికీ ఎక్కడా వ్యాపారులు శుభ్రంగా వుంచుకునే చర్యలు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి. ప్రతి వ్యాపారి తమ దుకాణం వద్ద డస్ట్ బిన్‌ను పెట్టుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు రోడ్లపై కూరగాయలు పోసి వ్యాపారాలు చేయడంపై కూడా కౌన్సిల్లో కౌన్సిలర్లు విమర్శిస్తున్నారు. అయినా మున్సిపల్ అధికారులు అక్కడ వ్యాపారులు మార్కెట్‌ను అపరిశుభ్రం చేయడంపై చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరించడమే కారణంగా కనబడుతోంది. ఇప్పటికైనా వ్యాపారులు ఇష్టారాజ్యానికి మార్కెట్‌ను వదిలేయకుండా ప్రజలకు సౌకర్యంగా పరిశుభ్రంగా మార్కెట్‌ను వుంచాలని కోరుతున్నారు.



మార్కెట్‌లో అంతర్గత రోడ్లపై పేరుకున్న మట్టి

రోజు వ్యర్థాలను తొలగించి శుభ్రపరుస్తాం

మార్కెట్‌లో నలుగురు వర్కర్లను పెట్టాం. నిత్యం మార్కెట్‌లో వ్యర్థాలు సకాలంలో తొలగించి శుభ్రంగా వుంచుతాం. రోడ్లపై మట్టి, కూరగాయల వ్యర్థాలు ఇటీవల వర్షాలు పడటం వలన పేరుకుంది.స్పెషల్ డ్రైవ్ పెట్టి క్లీనింగ్ చేస్తాం.

సుబ్బరాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫస్ట్ డివిజన్

114వ జీవో ప్రకారం న్యాయం చేయాలి

జమ్మలమడుగు, ఆగస్టు 30: జమ్మలమడుగు ఆర్టీసీ డిపో గ్యారేజీ గేటు ఎదుట నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్మిక నేతలు, కార్మికులు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ధర్నాలో డిపో అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మం, శివుడు, తదితరులు ప్లకార్డులు పట్టుకుని ధర్నా కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. జీవో నెంబరు 114 ప్రకారం న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రీజినల్ కమిటీ మెంబర్ శ్రీనివాసులు, కాంతయ్య, కార్మికులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ డిపో కార్యదర్శి భానుప్రసాద్ డిమాండ్ చేశారు.శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో గేట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ జోనల్ నాయకుడు రామకృష్ణయ్య మాట్లాడారు కార్యక్రమంలో రీజినల్ నాయకుడు ఎస్‌నారాయణ, డిపో అధ్యక్షుడు పీవీసీ మోహన్‌రెడ్డి, గ్యారేజీ కార్యదర్శి అశోక్‌కుమార్, జాయింట్ సెక్రటరీ వీటీ రావు తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలి

బి.కోడూరు, ఆగస్టు 30 : జూనియర్ కళాశాలలో ఉన్న లెక్చరర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ గడ్డం రాజశేఖర్ ప్రక టనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సబ్జెక్టులకు సంబంధించిన లెక్చరర్లు లేక ఫెయిల్ అవుతున్నారన్నారు. రాష్ట ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 476 పోస్టులు వెంటనే భర్తీ చేసి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు.

విద్యార్థులు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 30 : విద్యార్థి దశలో క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదిగేలా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ప్రొద్దుటూరు టూటౌన్ సీఐ యుగంధర్ అన్నారు. శుక్రవారం టు టౌన్ పరిధిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్డిచెరువును కబ్జా చేస్తున్న అక్రమార్కులు

చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

అట్లూరు, ఆగస్టు 30 : మండలంలోని రెడ్డిపల్లె, కొండూరు గ్రామానికి చెందిన రెడ్డి చెరువును సుమారు 20 ఎకరాలను ఎక్స్‌కవేటర్లు పెట్టి చదను చేసి అక్రమార్కులు ఆక్రమించారు. శుక్రవారం డోజర్లు, ఎక్స్‌కవేటర్లు ట్రాక్టర్లు పెట్టి చదును చేస్తుండగా స్థానికులు రెవెన్యూ అధికారులు సమాచారం ఇవ్వడంతోవీఆర్వో దొరబాబు, ఆర్ఐ కరీముల్లా చెరువు దగ్గరకు వెళ్లేసరికి ఆక్రమణదారులు పరారైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. గతంలో చెరువును ఆక్రమించి చీనీ చెట్లు కూడా నాటి కంచెలు వేశారని స్థానికులు రెవెన్యూ అధికారులకు తెలిపారు. రెవెన్యూ రికార్డులు ప్రకారం చెరువు విస్తీర్ణం 55 ఎకరాలు ఉంటుందని సర్వేయరు సుబ్బారెడ్డి తెలిపారు. రెడ్డిచెరువు కింద సుమారు 200 ఎకరాలు పారుదల ఉంటుందన్నారు. చుట్టుపక్కల చీనీ తోటలకు చెరువు నీటితో బోరుబావులు జలాలు పెరుగుతాయని, అటువ ంటి చెరువును సుమారు 20 ఎకరాలు ఆక్రమణదారులు చెరువును మట్టితో పూడ్చడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుందని రైతులు తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి చెరువు ఆక్రమణలను తొలగించాలని రెడ్డిపల్లె, కొండూరు రైతులు కోరుతున్నారు. రెడ్డిపల్ల చెరువు ఆక్రమణపై అట్లూరు తహసీల్దారు శివశంకర్‌ను వివరణ కోరగా, ఆక్రమించిన చెరువును సర్వేచేయించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని, హెచ్చరిక బోర్డులు పెట్టిస్తామని తహసీల్దారు తెలిపారు.



ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్న ఆక్రమణదారులు

గణేశ్ విగ్రహాల కొలువుకు అనుమతి తీసుకోవాలి

- ఆర్డీవో శ్రీనివాస్



జమ్మలమడుగు, ఆగస్టు 30: జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలో గణేశ్ విగ్రహాల కొలువుకు ముందస్తుగా అనుమతులు పొందాలని లేకపోతే కఠిన చర్యలు తప్పవని జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో అధికారులతో వినాయక చవితి పండుగ సందర్భంగా విగ్రహాల కొలువుకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సెప్టెంబరు 7వ తేదీ నుంచి వినాయక చవితి పండుగ సందర్భంగా ముందస్తుగా గణేశ్ కమిటీలకు సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రతి ఉత్సవ కమిటీవారు పెద్ద విగ్రహమైనా, చిన్న విగ్రహమైనా తప్పనిసరిగా అనుమతి పొందాలన్నారు. అనుమతి లేకపోతే తమ సిబ్బంది నిబంధనల మేరకు కేసులు నమోదు చేస్తారన్నారు. ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు కొలువైన వినాయక విగ్రహాల వద్ద ఎలాంటి ఇబ్బందులు జరగరాదన్నారు. రాత్రి సమయాల్లో కొలువైన విగ్రహాల వద్ద డీజే పెట్టడం నిబంధనలకు విరుద్ధమన్నారు. డీజేకి అనుమతి లేదన్నారు. ప్రతి ఉత్సవ కమిటీవారు ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా జాగ్రత్తగా నిమజ్జనం చేసుకోవాలన్నారు. ఆదిశగా అన్ని మండలాల్లోని ఎలక్ట్రికల్, పంచాయతీరాజ్, ఎంపీడీవోలు, పోలీసులు తదితర అధికారులు ముందస్తుగా సమావేశాలు ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం తదితర మండలాల అధికారులు పాల్గొన్నారు.

'గ్రామాల్లో పేదలకు వైద్యం అందడంలేదు'

అట్లూరు, ఆగస్టు 30 :మండలంలోని విలేజి క్లినిక్ సెంటర్ల వద్ద గ్రామీణ పేద ప్రజలకు వైద్యం అందడంలేదని కామసముద్రం సర్పంచ్ ఆర్‌వీ సుబ్బారెడ్డి స్థానిక వైద్యాధికారి మాధురిని నిలదీశారు. శుక్రవారం ఎంపీపీ పొత్తపి రమాదేవి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ క్లినిక్ సెంటరులో సిబ్బంది ఉండడంలేదని జ్వరం వచ్చినా, విరేచనాలకు సెలైన్ బాటిళ్లు, మందులు లేవంటున్నారని ఆరోపించారు. ఉపాధి హామీ ద్వారా గడ్డి విత్తనాలు రాయితీకి ఇవ్వాలని సమావేశంలో సర్పంచ్‌లు అడిగారు. దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరు చేస్తామని ఏపీవో రవిచంద్ర సమాధానం చెప్పారు. ఎంపీడీవో సుజాతమ్మ, తహసీల్దారు రవిశంకర్, మండల అధికారులు, ఎంపీటీసీలు సర్పంచ్‌లు హాజరయ్యారు.

కారు బోల్తా - ఒకరికి స్వల్ప గాయాలు

ఖాజీపేట, ఆగస్టు 30: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని పత్తూరు సమీపంలో కారు బోల్తాపడి ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. హైదరాబాదు నుంచి లక్కిరెడ్డిపల్లెకు వెళుతున్న కారు శుక్రవారం ఉదయం పత్తూరు బైపాస్ వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తాపడింది. కారులోని బెలూన్ ఓపెన్ కావడంతో స్వల్పగాయాలతో వారు బయటపడ్డారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

పోరుమామిళ్ల, ఆగస్టు 30 : ఏకీకృత పెన్షన్ స్కీం రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని ఏపీ ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ సంఘం నాయకులు జాషువా, భాస్కర్‌రెడ్డి, క్రిష్ణయ్య, రసూల్, బాల చెన్నయ్య, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఏకీకృత పెన్షన్ స్కీం అమలు తమకు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు శివప్రసాద్, బద్వేలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవానందం, సుధాకర్, గోపవరం మండల అధ్యక్షుడు వీరదాసరి, క్రిష్టపర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్టీవో కార్యాలయం వద్ద నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం నిరసన ప్రదర్శన చేపట్టారు.కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నరేశ్, గురయ్య, రామచంద్రయ్య, పవన్, పెంచలయ్య పాల్గొన్నారు.

వ్యాయాయ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

మైలవరం, ఆగస్టు 30: మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో అతిథి వ్యాయాయ ఉపాధ్యాయిని (పీఈటీ) పోస్టు ఖాళీగా ఉందని.. అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మైలవరం బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభావతిదేవి శుక్రవారం తెలిపారు. పిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ లేదా అండర్ గ్రాడ్యుయేషన్ చేసిన వారై ఉండాలని.. ఇతర వివరాలకు పాఠశాల ప్రిన్సిపాల్ లేదా 8712625060 ఫోన్ నంబర్ సంప్రదించాలన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



ఎక్స్‌కవేటర్‌తో గుంత తవ్విస్తున్న పోలీసులు

చాపాడు, ఆగస్టు 30: మండలంలోని కుందూ నది, పెన్నానది నుంచి ఎవరైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐ చిన్నపెద్దయ్య పేర్కొన్నారు. శుక్రవారం అధికారులు తిప్పిరెడ్డిపల్లె, రాజుపాళెం, వెదురూరు గ్రామాల మధ్య పెన్నానది తీరం వెంబడి పలు చోట్ల ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తవ్వారు. ట్రాక్టర్ల ద్వారా నదిలోని ఇసుకను తరలించకుండా ఈ గుంతలు తవ్వినట్లు సీఐ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా కాకుండా ఉండేందుకు సహకరించాలని ఆయన గ్రామస్థులను కోరారు. ఎవరైనా ఇసుకను తరలిస్తే తమ సెల్‌నంబరు 9121100621కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సీఐ కోరారు.

మొక్కల పెంపకంపై శిక్షణ సదస్సు

కొండాపురం, ఆగస్టు 30: మండలంలోని బురుజుపల్లె గ్రామంలో శుక్రవారం రైతులకు అటవీ యేతర ప్రాంతంలో మొక్కల పెంపకంపై శిక్షణ సదస్సు నిర్వహించారు. రాష్ట్ర అటవీ యేతర చెట్ల సంరక్షణ కో-ఆర్డినేటర్ కె.సతీష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కో-ఆర్డినేటర్ జశ్వంత్, అధికారులు సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం వీడాలి



విలేజ్ క్లినిక్‌కు తాళాలు తీయని దృశ్యం

జమ్మలమడుగు, ఆగస్టు 30: ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని స్థానికులు కోరుతున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలు దాటుతున్నా మోరగుడి గ్రామంలోని రచ్చబండ సమీపాన ఉన్న విలేజ్ క్లినిక్‌కు తాళాలు తీయలేదు. సిబ్బంది విలేజ్ క్లినిక్‌కు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో అంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

కమలకూరు పశువైద్యాధికారికి మెమో

అట్లూరు, ఆగస్టు 30: మండలంలోని కమలకూరు పశువైద్యాధికారి ఈశ్వర్ ప్రసాద్ సెలవు పెట్టకుండా.. రెండురోజులుగా విధులకు డుమ్మా కొట్టడంతో మెమో జారీ చేసినట్లు సిద్దవటం ఏడీ లక్ష్మీదేవి తెలిపారు. శుక్రవారం కమ లకూరు వైద్యశాలను ఏడీ ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యాధికారి విధులకు హాజరు కాకపోవడంతో హాజరు పట్టిక పరిశీలించగా... రెండురోజులుగా రాకపోవడంతో వైద్యాధికారికి మెమో జారీ చేసినట్లు ఏడీ తెలిపారు.

జంబు తొలగింపు పనులు వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే



ఉత్తర కాలువలో జంబును తొలగిస్తున్న దృశ్యం

మైలవరం, ఆగస్టు 30: మైలవరం జలాశయం నుంచి వచ్చే కాలువల్లో ఉన్న జంబును తొలగించే పనులను వేగవంతం చేయాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మైలవరం జలాశయం నుంచి నీటిని విడుదల చేసిన అనంతరం ఉత్తరకాలువలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. కాలువలో జంబు తొలగిస్తేనే నీళ్ల రైతులకు సకాలంలో అందుతాయన్నారు. లేకుంటే రైతులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. కాలువలలో జంబు ఉన్న చోటల్లా యంత్రాలను పంపి తొలగించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

యమపాశాల్లాగా కరెంటు తీగలు

జమ్మలమడుగు, ఆగస్టు 30: జమ్మలమడుగు పట్టణంలోని పలు వార్డుల్లో కరెంటు తీగలు యమపాశాల్లాగా మారాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడంలేదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. శుక్రవారం జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కాపువీధిలో కిందకు వేలాడుతున్న విద్యుత్తు తీగలను చూపిస్తూ ఇప్పటికైనా అధికారులు స్పందించాలన్నారు. ఇటీవల అనేక మండలాల్లో విద్యుత్తు ప్రమాదాలు జరిగాయన్నారు. ఆయా వార్డుల్లో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, పట్టణ సహాయ కార్యదర్శి మహేష్‌యాదవ్, ఇషాక్, రాఘవ, సూరి, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో వర్షం



ఎర్రగుంట్ల ఆగస్టు30:ఎర్రగుంట్లలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అరగంటకు పైబడి వర్షం నిరంతరంగా కురవడంతో ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి.అలాగే కొన్ని వీధుల్లోకి భారీగా నీరు చేరడంతో అక్కడికక్కడే ఆగిపోయాయి. 20 రోజులు గా ఉక్కపోతతో కూడిన ఎండలు నిండు వేసవిని తలపించాయి. ప్రజలు ఈ ఎండల దెబ్బకు ఇబ్బంది పడ్డారు. ఈ వర్షం పడడంతో కొంత మేరకు వాతావరణం చల్లబడింది.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం



మైదుకూరు, బద్వేలులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బ్రహ్మంగారిమఠం/మైదుకూరు రూరల్, ఆగస్టు 30 : మానవ మనుగడకు మొక్కలే ఆధారమని మైదుకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మైదుకూరు మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, కమిషనర్ జబ్బార్‌మియా, కౌన్సిలర్లు ఆకుల క్రి ష్ణయ్య, మిల్లు శ్రీను, యాపరాల లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు, మున్సిపాలిటీ ప్రజలు పాల్గొన్నారు.

బద్వేలుటౌన్..: మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, మున్సిపల్ కమిషనర్ వాకమల్ల వెంకటనరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ఆవరణలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, డాక్టర్ రాంప్రసాద్, టీడీపీప్రధాన కార్యదర్శి మిత్తికాయల రమణ, మస్తాన్‌బాబు, సీనియర్ న్యాయవాది పీవీఎస్‌ప్రసాద్, జహంగీర్‌బాషా, లక్ష్మీదేవి, షరీఫ్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని అగస్త్యేశ్వరస్వామి ఆలయం అర్చకులు పేర్కొన్నారు. శుక్రవారం దేవదాయ శాఖ ఆదేశాల మేరకు వన మహోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేద పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేష్‌శర్మ, ఆలయ పాలక మండలి ఎక్స్అఫియోమెంబర్ మహేశ్వరశర్మ, అర్చకుడు ఉదయభాస్కర్, రికార్డు అసిస్టెంట్ శివప్రసాద్, మాధవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.